క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నల్లగొండ : పట్టణంలో 11కేవీ విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 6గంటల నుంచి 7.30గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు నల్లగొండ విద్యుత్ ఏడీఈ నవీద్ అహ్మద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బస్టాండ్, డాక్టర్స్ కాలనీ, గ్రీన్‌ల్యాండ్ ఆసుపత్రి ఏరియా, గొల్ల గూడ, రామ్‌నగర్, బీటీఎస్, ఆర్టీసీకాలనీ, క్రాంతినగర్, పద్మావతికాలనీ, దారుపాషా కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు అందుకు ప్రజలు సహకరించాలని కోరారు.

ఐకేపీ సెంటర్‌లో వసతుల కల్పన



తొండలవాయి ఐకేపీ కేంద్రంలో వసతులు కల్పించిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

నార్కట్‌పల్లి : మండలంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వసతులు లేక రైతులు ఇబ్బందులు పడుతుండడంతో సాక్షి దినపత్రికలో రైతుల ఇబ్బందులపై కథనాన్ని ఇటీవల ప్రచురించింది. అందుకు స్పందించిన అధికారులు ఐకేపీ కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు తాగునీరు, నీడ, విద్యుత్ సౌకర్యం వంటి మౌలిక వసతులు కల్పించినట్లు నిర్వాహకురాలు కీర్తి మున్నీ శుక్రవారం తెలిపారు.

తప్పుడు ధ్రువపత్రాలు ఇచ్చిన వారిపై చర్యలు తీసుకోవాలి

నల్లగొండ టౌన్ : తప్పుడు ధ్రువీకరణ పత్రాలు ఇచ్చిన రెవెన్యూ అధికారులు, కోర్టును తప్పుదోవ పట్టిస్తున్న జెడ్పీ అధికారులపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని కోరుతూ శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో అలిసెట్టి పద్మ వినతిపత్రం అందజేసింది.

బీజేపీ ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా హరి



ఏరుకొండ హరి

నల్లగొండ టూటౌన్ : పట్టణానికి చెందిన ఏరుకొండ హరి బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు పిట్టల శ్రీనివాస్ శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నియామక ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా హరి మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఓబీసీలను సంఘటితం చేసి రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ ఎంపీ అభ్యర్థులను గెలిపించేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని అన్నారు. తన నియామకానికి సహకరించిన పార్టీ రాష్ట్ర కార్యదర్శి మాదగాని శ్రీనివాస్‌గౌడ్, జిలా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు పిట్టల శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

నార్కట్‌పల్లి : మండలంలోని ఏపీలింగోటం మసీదు కమిటీ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ నూతన అధ్యక్షుడిగా బుడం సాహెబ్ ఎన్నికయ్యారు. ఈ ఎన్నిక ఎస్‌కె గోరేమియా, ఎస్‌కె నన్నెసాయబ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఎస్‌కె లతీఫ్, ఎస్‌కె సయ్యద్, సయ్యద్ అజ్జు, ఎస్‌కె యూసుఫ్, బషీర్, నన్నెసాహెబ్ తదితరులున్నారు.

నగదు పట్టివేత



నగదు స్వాధీనం చేసుకుంటున్న పోలీసు

చండూరు : ఎన్నికల కోడ్ అమలులో భాగంగా మండలంలోని అంగడిపేట గ్రామశివారు పెట్రోల్ బంక్ వద్ద శుక్రవారం పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో బంగారిగడ్డ గ్రామం నుంచి కారులో వస్తున్న వీరమల్ల సాయికుమార్ వద్ద రూ.60వేలు, ఆడెపు మహేష్ వద్ద రూ.70వేలు స్వాధీనం చేసుకున్నారు. ఆధారాలు లేకుండా తరలిస్తున్న నగదును జిల్లా ట్రెజరరీ కార్యాలయానికి పంపించినట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు.

వాహనాల తనిఖీల్లో నగదు పట్టివేత

చిట్యాల : మండలంలోని వట్టిమర్తి గ్రామ శివారులో ఏర్పాటు చేసిన పోలీస్ చెక్‌పోస్టు వద్ద శుక్రవారం నిర్వహించిన వాహనాల తనిఖీల్లో నగదు పట్టివేసినట్లు చిట్యాల ఎస్ఐ సైదాబాబు తెలిపారు. వాహనంలో ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.68వేలను స్వాధీనం చేసుకున్నట్లు, ఆ నగదును జిల్లా ట్రెజరీ అధికారులకు అప్పగించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

వసతులు లేక అవస్థలు !

- ప్రభుత్వ కార్యాలయాల్లో మరుగుదొడ్లు, మూత్రశాలలు లేక ఇబ్బందులు పడుతున్న సిబ్బంది
- కేతేపల్లి ఎంపీడీఓ కార్యాలయంలో శిథిలావస్థకు చేరిన టాయిలెట్లు
- మహిళా సిబ్బంది కష్టాలు



కేతేపల్లి మండల పరిషత్ కార్యాలయం



ఎంపీడీఓ కార్యాలయంలో శిథిలావస్థకు చేరిన మరుగుదొడ్లు

కేతేపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో దాదాపు పది ప్రభుత్వ శాఖల కార్యాలయాలు కొనసాగుతున్నాయి. కేతేపల్లి మండలంలోని 16 గ్రామ పంచాయతీలు, ఆవాస గ్రామాల నుంచి ప్రజలు నిత్యం వివిధ పనుల నిమిత్తం మండల కార్యాలయాలకు వస్తుంటారు. కానీ ఇక్కడ మరుగుదొడ్లు, మూత్రశాలలు లేకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మూత్రశాలలు, మరుగుదొడ్లు లేకపోవడంతో అత్యవసర పరిస్థితి ఎదురైతే బయటకు వెళ్లాల్సిన పరిస్థితి. కొన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులకు సైతం మూత్రశాలలకు మరుగుదొడ్లు లేవు. దీంతో అందులో పనిచేసే మహిళా సిబ్బంది బాధలు వర్ణనాతీతం.

ఐదెకరాల విస్తీర్ణంలో..

కేతేపల్లి మండల కేంద్రంలో ఇరవై ఏళ్ల క్రితం ప్రభుత్వం సుమారు ఐదెకరాల స్థలాన్ని కొనుగోలు చేసింది. ప్రజలకు ఒకేచోట అన్ని రకాల సేవలు అందించాలనే ఉద్దేశంతో ఆ స్థలంలో ప్రభుత్వ కార్యాలయాలు, వైద్యశాలలను ఏర్పాటు చేసింది. అందులో మండల పరిషత్ కార్యాలయం, తహసీల్దారు కార్యాలయం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పశు వైద్యశాల, రైతు వేదిక, వననర్సరీ, ఆయుర్వేద వైద్యశాల, గ్రామ పంచాయతీ కార్యాలయం, మండల వ్యవసాయ అధికారి కార్యాలయం, ట్రాన్స్‌కో ఈఏ కార్యాలయం, బీఎస్ఎన్ఎల్, నీటిపారుదల శాఖ కార్యాలయాలకు పక్కా భవనాలు నిర్మించారు. గ్రామ పంచాయతీ, ఎంపీడీఓ, తహసీల్దారు కార్యాలయాలు, రైతు వేదిక, ప్రాథమిక ఆరోగ్యకేంద్రం భవనాలు నిర్మించే సమయంలో మరుగుదొడ్లు, మూత్రశాలలు నిర్మించారు. అయితే వీటి నిర్వహణను ఎవరూ పట్టించుకోకపోవడంతో శిథిలావస్థకు చేరాయి. మండల పశువైద్యాధికారి, వ్యవసాయ అధికారి, ట్రాన్స్‌కో ఏఈ కార్యాలయాల్లో మరుగుదొడ్లు నిర్మించలేదు. దీంతో విధులు నిర్వహించే అధికారులు, సిబ్బందికి ఇబ్బందులు తప్ప డం లేదు. కనీసం చేతులు శుభ్రం చేసుకునేందుకు కూడా నీటి వసతి లేకపోవడంతో పక్క కార్యాలయాల నుంచి నీరు తీసుకువచ్చి వాడుకుంటున్నారు. ఆయా కార్యాలయాల్లో పనుల నిమిత్తం గ్రామీణ ప్రాంతాల ప్రజలు నిత్యం వస్తుంటారు. వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్లు తహసీల్దారు కార్యాలంలోకి మార్చిన తర్వాత దూర ప్రాంతాల నుంచి వచ్చే వారి సంఖ్య పెరిగింది. ఇక్కడ మూత్రశాలలు, మరుగుదొడ్ల సౌకర్యం లేకపోవడంతో అత్యవసర సమయంలో ఎక్కడికి వెళ్లాలో అర్థం కాక ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. సంబంధిత శాఖల ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వ కార్యాలయాల్లో మరుగుదొడ్లు మూత్రశాలలు నిర్మించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

మరుగుదొడ్లు నిర్మించాలి



కేతేపల్లిలోని ప్రభుత్వ కార్యాలయ సముదాయంలో అత్యవసర పరిస్థితుల్లో వెళ్లేందుకు మూత్రశాలలు, మరుగుదొడ్లు లేవు. దూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కోసారి వచ్చిన పని కాకుండానే అత్యవసర పరిస్థితుల్లో బయటకు వెళ్లాల్సి వస్తోంది. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మూత్రశాలలు, మరుగుదొడ్లు నిర్మించాలి. – ఎ.జగన్నాథం, గుడివాడ

నిధులు కేటాయించాం



ప్రస్తుతం ఉన్న మరుగుదొడ్లు, మూత్రశాలల నిర్వహణ లేకపోవడంతో ఉపయోగించేందుకు వీలు లేకుండా మారాయి. కార్యాలయం వెనుక నూతనంగా మరుగుదొడ్లు నిర్మించేందుకు 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.2 లక్షలు కేటాయించాం. పనులు ప్రారంభించి త్వరితగతిన పూర్తిచేస్తాం.

– బి. శ్రీనివాసరావు, ఎంపీడీఓ, కేతేపల్లి

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



ఎమ్మెల్యే మందుల సామేల్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న నూక కిరణ్‌కుమార్

శాలిగౌరారం : మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ మండల నాయకులు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు శుక్రవారం తిరుమలగిరిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో స్థానిక ఎమ్మెల్యే మందుల సామేల్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా ప్రతీఒక్కరూ పనిచేయాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామాలు అభివృద్ధి పథంలో దూసుకెళ్తాయని అన్నారు. గ్రామాల అభివృద్ధికి తనవంతు కృషి ఎల్లవేళలా ఉంటుందన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ కనుమరుగవ్వడం ఖాయమన్నారు. పార్టీలో చేరిన వారిలో శాలిగౌరారం ఎంపీటీసీ జోగు సైదమ్మ, మాజీ సర్పంచ్‌లు గౌర వీరయ్య, బండారు శంకరయ్య, జటంగి శంకర్, నాయకులు నూక కిరణ్‌కుమార్, కిశోర్, షేక్ జహంగీర్, జమ్ము అశోక్ ఉన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సమరంరెడ్డి, మండల నాయకులు చాడ సురేశ్‌రెడ్డి, చామల మహేందర్‌రెడ్డి, జయపాల్‌రెడ్డి, షేక్ ఇంతియాజ్, నోముల జనార్దన్, అన్నెబోయిన సుధాకర్, రాపర్తి వెంకటేశ్, గూని వెంకటయ్య, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలి



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఏపీఓ రాంమోహన్

కట్టంగూర్ : ఉపాధిహామీ పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఓ కడియం రాంమోహన్ అన్నారు. శుక్రవారం మండలంలోని కల్మెర గ్రామంలో గల తెట్టెకుంట చెరువులో జరుగుతున్న పూడికతీత పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. ఏప్రిల్ 1నుంచి కేంద్ర ప్రభుత్వం రూ.272 నుంచి రూ.300గా దినసరి వేతనం పెంచిందని తెలిపారు. గ్రామస్థాయిలో పనిచేస్తున్న ఎఫ్ఏలు పనుల పట్ల నిరంతరం పర్యవేక్షణ చేయాలని సూచించారు. ప్రస్తుతం మండలంలో కూలీలు 2800 పనిచేస్తున్నారని, కూలీల సంఖ్య 5000 వరకు పెంచాలని ఎఫ్ఏలను ఆదేశించారు. కూలీలందరికీ సరిపడా పనులు కల్పిస్తామన్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పనిప్రదేశంలో అందుబాటులో ఉంచాలన్నారు. ఆయన వెంట ఫీల్డ్ అసిస్టెంట్లు, కూలీలు ఉన్నారు.

ప్రజలపై పన్నుల భారం మోపుతున్న కాంగ్రెస్



మర్రిగూడ : మాట్లాడుతున్న ఏర్పుల యాదయ్య



కట్టంగూర్ : సమావేశంలో మాట్లాడుతున్న తుమ్మల వీరారెడ్డి

మర్రిగూడ : రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కొద్ది రోజుల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలపై పన్నుల భారాన్ని మోపుతుందని సీపీఎం మండల కార్యదర్శి ఏర్పుల యాదయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని ఇందుర్తి గ్రామంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సీపీఎం భువనగిరి ఎంపీ అభ్యర్థి ఎండీ.జహంగీర్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని అన్నారు. మతోన్మాద బీజేపీని ఓడించాలనే లక్ష్యంతో సీపీఎం అభ్యర్థిని గెలిపించాలని కోరారు. మోసపూరిత హామీలను నమ్మి ప్రజలు మోసపోకుండా ఈ ప్రాంత అభివృద్ధి కోసం పాటుపడుతున్న కమ్యూనిస్టులను గెలిపించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు పగిళ్ల రామచంద్రం, అయితగోని నరసింహాగౌడ్, అనంతల నరసింహాగౌడ్, శ్రీరామదాసు సుదర్శనమ్మ, చెరుకు గౌరమ్మ, కవిత, ఇందిరమ్మ, రాములమ్మ, సత్యనారాయణ, సత్తమ్మ, మట్టమ్మ, నర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం అభ్యర్థి జహంగీర్‌ను గెలిపించాలి

కట్టంగూర్ : ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడే ప్రజా నాయకుడు భువనగిరి పార్లమెంట్ సీపీఎం అభ్యర్థి ఎండీ జహంగీర్‌ను అధిక మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు తుమ్మల వీరారెడ్డి కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశాన్ని 10సంవత్సరాలుగా పాలిస్తున్న బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వ రంగాలను నిర్వీర్యం చేసిందన్నారు. దేశసంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతూ పేద ప్రజలపై పెనుభారం మోపుతుందన్నారు. కరువు పరిస్థితులు తీవ్రమవుతున్నా రాష్ట్ర ప్రభుత్వం రైతాంగాన్ని ఆదుకునేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఇప్పుడున్న భిన్న పార్టీల పార్లమెంట్ అభ్యర్థులు ప్రజా సమస్యలపై పోరాడిన చరిత్ర లేదన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు చిన్నపాక లక్ష్మీనారాయణ, గంజి మురళీధర్, మండల కార్యదర్శి పెంజర్ల సైదులు, మురారి మోహన్, చిలుముల రామస్వామి, జాల రమేష్, గడగోజు రవీంద్రాచారి, కట్ట బక్కయ్య, ఊట్కూరి యాదయ్య, చిలుకూరి సైదులు, గద్దపాటి ఇస్తారి, ఆగయ్య, నరహరి తదితరులు ఉన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి



రామగిరి(నల్లగొండ) : ధాన్యం ఎగుమతులను పరిశీలిస్తున్న పీడీ నాగిరెడ్డి



కనగల్ : బోయినపల్లిలో కొనుగోలు కేంద్రంలో ధాన్యం మ్యాశ్చర్ చూస్తున్న లక్ష్మీనారాయణ

రామగిరి(నల్లగొండ) : ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని డీఆర్‌డీఓ పీడీ నాగిరెడ్డి అన్నారు. గురువారం తిప్పర్తి మండలంలోని అనిశెట్టి దుప్పలపల్లిలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. తూకం వేసిన ధాన్యాన్ని త్వరితగతిన తరలించాలని నిర్వాహకులను ఆదేశించారు. ఆయన వెంట ఏపీఎం శ్రీదేవి పాల్గొన్నారు.

కనగల్ : మండల వ్యాప్తంగా ఏర్పాటు చేసిన ఐకేపీ కేంద్రాలలో ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని బీసీ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కాంగ్రెస్ నాయకుడు సింగం లక్ష్మీనారాయణ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని బోయినపల్లి ఐకేపీ సెంటర్‌ను ఆయన పరిశీలించి మాట్లాడారు. అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని మ్యాచ్చర్‌తో సంబంధం లేకుండా కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆయన వెంట చిత్రం ఉమాశంకర్, చింత శంకర్, పోలె కృష్ణయ్య, సింగం వెంకటేశం, చిత్రం వెంకటేశం, సింగం యాదయ్య, కడారి వెంకన్న, వంపు పుల్లయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో సీరియల్ పాటించాలని ధర్నా

మండల పరిధిలోని జీ ఎడవల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో సీరియల్ పాటించి కొనుగోలు చేయాలని గ్రామ రైతులు నల్లగొండ – చండూర్ ప్రధాన రహదారిపై శుక్రవారం ధర్నా చేశారు. ఐకేపీ నిర్వాహకులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని డిమాండ్ చేశారు. అనంతరం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని రైతులకు నచ్చజెప్పి ధర్నాను విరమింపజేశారు.



కనగల్ : ధర్నా చేస్తున్న రైతులు

శ్రీరామనవమికి ముమ్మరంగా ఏర్పాట్లు







రెండో భద్రాద్రిగా పేరు పొందిన నల్లగొండ పట్టణంలోని రామగిరి శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో ఈనెల 15నుంచి 21వరకు నిర్వహించే శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలకు నిర్వాహకులు ముమ్మరంగా ఏర్పాటు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో చలువ పందిళ్లు, ఆలయానికి రంగులు, విద్యుత్ దీపాలు, రథాన్ని సిద్ధం చేస్తున్నారు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నల్లగొండ

కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రచారం



కేంద్ర పథకాలపై ప్రచారం నిర్వహిస్తున్న గోలి ప్రభాకర్

కట్టంగూర్ : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను అర్హులైన ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు గోలి ప్రభాకర్ అన్నారు. శుక్రవారం మండలంలోని అయిటిపాముల గ్రామంలో లాబార్థి సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఉపాధి కూలీలకు కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించారు. అనంతరం గ్రామంలో ఆయన ఇంటింటికి తిరిగి బీజేపీ భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్‌కు ఓటు వేసి అధిక మెజార్టీతో గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. కేంద్రంలోని బీజేపీ మరోసారి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో గోలి మహేశ్వరి, విజయ్‌కుమార్, నీలం శ్రీరామ్, నాయకులు తదితరులు ఉన్నారు.

గుత్తా సుఖేందర్‌రెడ్డిని కలిసిన ముస్లిం నాయకులు



అబ్దుల్ కరీంకు ఖర్జూర తినిపిస్తున్న గుత్తా సుఖేందర్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్ : రంజాన్ పండుగ సందర్భంగా పట్టణంలోని శుక్రవారం తెలంగాణ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డిని ముస్లిం మైనారిటీ నాయకుడు మహమ్మద్ అబ్దుల్ కరీం (హన్నుబాయి) కలిశారు. ఈ సందర్భంగా సుఖేందర్‌రెడ్డి ఆయనకు ఖర్జూర తినిపించి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట కనగల్ జెడ్పీటీసీ చిట్ల వెంకటేశం, బీఆర్ఎస్ నాయకులు ఐతగోని స్వామిగౌడ్, నర్సింహారెడ్డి, హరికృష్ణ, గోపాల్‌రెడ్డి, యాదగిరి, శ్రీని వాస్‌రెడ్డి, రిటైర్డ్ వార్డెన్స్ సంఘం అధ్యక్షుడు పాతూరి ఇంద్రసేనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలీలను పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం

చండూరు : తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వ పద్మశాలీలను పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తుందని, అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో అన్యాయం చేశారని పద్మశాలి రాజ్యాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ ఏలే మహేష్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భువనగిరి పార్లమెంట్‌కు పద్మశాలి రాజ్యాధికార సమితి పోటీ చేయబోతుందని తెలిపారు. మన ఓట్లు మనమే వేసుకొని అన్ని రాజకీయ పార్టీలకు మన సత్తాను చూపుదామన్నారు. పద్మశాలీలు ఐక్యంగా ఉండాలని, ఎన్నికల్లో విజయం సాధించాలని అన్నారు. సమావేశంలో గుర్రం నవీన్, చెరుకు విజయ్, జెల్ల రఘు, తీరందాసు చంద్రం, చెరుపల్లి నాగరాజు, పున్న ప్రవీణ్, గంజి అనిల్ ఉన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ : పట్టణంలోని నందిపాడ్ బైపాస్ వద్ద గంధం మట్టయ్యజానకమ్మల జ్ఞాపకార్థంగా ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శుక్రవారం ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ప్రారంభించి మాట్లాడారు. వేసవిలో ఎండలు తీవ్రంగా ఉన్నందున అత్యవసర సమయాల్లో బయటకు వెళ్లినా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

వేముల నాగయ్య సేవలు మరువలేనివి



నాగయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సుధాకర్‌రెడ్డి

నల్లగొండ టౌన్ : పేద ప్రజల కోసం వేముల నాగయ్య చేసిన సేవలు మరువలేనివని సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి కొనియాడారు. శుక్రవారం పట్టణంలోని దొడ్డి కొమరయ్య భవన్‌లో నాగయ్య 8వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా నాగయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. కనగల్ మండల కేంద్రంలో యువజన నాయకుడిగా రాజకీయ జీవితాన్ని ప్రారంభించిన నాగయ్య మరణించే వరకు పేదల కోసం పోరాటాలు నిర్వహించారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు తుమ్మల వీరారెడ్డి, పాలడుగు నాగార్జున, చినపాక లక్ష్మీనారాయణ, పామునగుండ్ల అచ్చాలు, గంజి మురళీధర్, దండెంపల్లి సత్తయ్య, పుచ్చకాయల నర్సిరెడ్డి, కొండ వెంకన్న, బొల్లు రవీందర్, సైదాచారి, మారయ్య, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా వెంకట్‌రెడ్డి

మాడుగులపల్లి : మండలంలోని చెరువుపల్లి గ్రామానికి చెందిన గడ్డం వెంకట్‌రెడ్డి బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా నియమితులయ్యారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు గోలి మధుసూదన్‌రెడ్డి ఆయనకు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. బీజేపీ తరఫున జిల్లాలో రైతు సమస్యల పరిష్కారానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ నల్లగొండ ఎంపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి, పార్లమెంట్ కన్వీనర్ బండారు ప్రసాద్, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కన్మంతరెడ్డి శ్రీదేవిరెడ్డి, రాష్ట్ర నాయకుడు పిల్లి రామరాజుయాదవ్, సాంబయ్య, భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

కేతేపల్లి : మండలంలోని వివిధ గ్రామాలకు వెళ్లే బీటీరోడ్లపై స్థానిక రైతులు ఆరబోసిన వరిధాన్యంతో వాహనదారులకు ప్రమాదం పొంచి ఉంది. ధాన్యం రాశులకు రక్షణగా రోడ్డుపై అడ్డగోలుగా పెడుతున్న బండరాళ్లతో వాహనదారులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ ఏడాది మూసీ ఆయకట్టుకు యాసంగి సీజన్‌లో నీటిని విడుదల చేయడంతో మండలంలోని ఆయకట్టు గ్రామాల్లో వరిధాన్యం దిగుబడి బాగా వచ్చింది. వరిపంటలను యంత్రాలతో నూర్పిడి చేయించి ఆరబెట్టేందుకు వ్యవసాయ బావుల వద్ద కల్లాలు లేకపోవడం, కొనుగోలు కేంద్రాలలో సరిపడా స్థలం లేకపోవడంతో వరిపొలం కోయగానే రైతులు ధాన్యాన్ని నేరుగా రోడ్లపైకి తీసుక వచ్చి ఆరపోస్తున్నారు. ఈ క్రమంలో కొర్లపహాడ్, కేతేపల్లి, చీకటిగూడెం, గ్రామాల్లో నిత్యం వాహనాలతో రద్దీగా ఉంటే హైవేతో పాటు, కొప్పోలు, ఉప్పలపహాడ్ గ్రామాల్లో రోడ్లు పూర్తిగా ధాన్యం రాశులతో నిండిపోయాయి. ధాన్యానికి రక్షణగా రైతులు రోడ్డుపైనే పెద్దపెద్ద బండరాళ్లను పెడుతున్నారు. దీంతో రాత్రివేళ ఆయా రోడ్లపై ప్రయాణించే వాహనాదారులకు దగ్గరకు వచ్చే వరకు రాళ్లు కనబడక ప్రమాదాల బారిన పడుతున్నారు. ప్రమాదాలు జరిగిన తర్వాత హడావుడి చేసే పోలీసులు రోడ్లపై ప్రమాదకరంగా రాళ్లు పెడుతున్నా పట్టించుకోకపోవడంతో పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదం జరగక ముందే పోలీసులు మేల్కొని రోడ్డుపై రాళ్లు పెట్టకుండా రైతులకు అవగాహన కల్పించాలని వాహనదారులు కోరుతున్నారు.



కొర్లపహాడ్‌లో హైవేపై ధాన్యం రాశుల వెంట ఉంచిన బండరాళ్లు



ఉప్పలపహాడ్‌లో రోడ్డులో..



కొప్పోలు రోడ్డులో ..